ఫీజులపై క్రమబద్ధీకరణ తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, ఫీజుల నియంత్రణకు క్రమబద్ధీకరణ విధానాన్ని తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కొన్ని పాఠశాలలు ప్రతి ఏడాది పదిశాతం నుంచి 30 శాతం వరకు ఫీజులను పెంచుతూ.. దోపిడీ చేస్తున్నాయన్నారు. దీనివల్ల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థికభారం పెరుగుతుందన్నారు. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ తరహాలో ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీని వేయాలని కోరారు. ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకొచ్చేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు లెనిన్, ఉపాధ్యక్షులు నాగేందర్, నాయకులు శ్రీమాన్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మా భగవతికా విశాల్ జాగరణ'



జాగరణ్ వేడుకల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్

కాచిగూడ: భత్రి తెలి నవ యువక్ సేవా చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మా భగవతికా విశాల్ జాగరణ' వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కాచిగూడ భత్రి తెలి సంఘ్ భవన్‌లో జై మాత పూజలు, భజనలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత సంతరించుకుంది. విద్యుత్ దీపాల కాంతులు, అందమైన అలంకరణతో ఆ ప్రాంతమంతా చూపరులను ఆకర్షించింది. కళాకారుల నృత్యాలు, దేవతామూర్తుల అలంకరణలు, మహిళల ఆటపాటలు, యువతుల దాండియా, కోలాటం అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, సందీప్, అనూప్, శ్రీకాంత్, జైకరణ్, అశ్విన్, ఉదయ్, నికేష్, గోపికృష్ణ, రాకేష్, సంతోష్, రాహుల్, గోపి, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ అమృత

ముషీరాబాద్: ఆత్మరక్షణకు కరాటే, తైక్వాండో దోహదపడతాయని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లో ఓమా తైక్వాండో అకాడమీ, వరల్డ్ ఫేమస్ మార్షల్ ఆర్ట్స్, తైక్వాండో కలర్‌బెల్టు టెస్ట్, తైక్వాండో మాస్టర్ ప్రసన్న ఆంజనేయులు ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ అమృత మాట్లాడుతూ.. విద్యతో పాటు విద్యార్థులు క్రీడలపై దృష్టిసారించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. తైక్వాండో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరీశంకర్, ప్రవీణ్‌కుమార్, సీనియర్ కోచ్ శ్రీనిక, హాసిని, కాలనీ అధ్యక్షులు రఘురాం, నాయకులు గోపాల్, రవి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

- నల్లకుంట, పద్మానగర్ కాలనీలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 150 మంది విద్యార్థులకు కలర్‌బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రతి ఒక్కరూ పేదలకు చేయూతనందించాలి



మహాత్మనగర్‌లో నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: పేదలకు చేయూతను అందించేందుకు సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్ బిజ్జి కనకేష్‌కుమార్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మనగర్‌లో సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్‌శాఖ ఆధ్వర్యంలో 50 మంది పేదలకు ఉచితంగా బియ్యం, కందిపప్పు, చక్కెర, పిండి, నూనె, టీ పొడర్ తదితర నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2012 నుంచి ప్రతినెల పేదలకు నిత్యావసరాలను అందజేస్తున్నామన్నారు. తమ శాఖ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్‌శాఖ నాయకులు రామన్, రాజు, మధుసూదన్, నర్సింహ్మా, స్వామి పాల్గొన్నారు.

ప్రైవేటు వాహనాల అద్దె చెల్లించాలని వినతి



రవాణాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేసిన సతీష్‌కుమార్

కవాడిగూడ: పార్లమెంటు ఎన్నికల్లో అద్దెకు తీసుకున్న ప్రైవేటు మోటార్ క్యాబ్ వాహనాలకు అద్దె చెల్లించాలని 'తెలంగాణ రాష్ట్ర క్యాబ్స్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రవాణశాఖ అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆదివారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేష్, సోమాజీ, హరికృష్ణతో కలిసి మాట్లాడుతూ... ఎన్నికలు ముగిసి 15 రోజులు గడుస్తున్నా.. రవాణాశాఖ, జీహెచ్ఎంసీ అధికారులు అంబర్‌పేట, మలక్‌పేట, కొండాపూర్ రవాణాశాఖ కార్యాలయాల్లో అద్దెకు తీసుకున్న మోటార్ వాహనాలకు అద్దె డబ్బులు చెల్లించకుండా ప్రైవేటు క్యాబ్ యజమానులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జీవో నెంబర్ 166 నిబంధనల మేరకు ప్రతి క్యాబ్‌కు అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రవాణాశాఖ అధికారులు కనీస పనిగంటలు 8గంటల కంటే అధికంగా పనిచేయించుకున్నారని, అధిక పనిగంటలకు గంటకు రూ.250 చొప్పున చెల్లించాలని అధికారులను కోరారు.

విశ్వకర్మ లెజెండరీ అవార్డుల ప్రదానం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్స్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వివిధ రంగాల్లో సేవలందించిన పలువురు విశ్వకర్మ ప్రముఖులను విశ్వకర్మ లెజెండరీ అవార్డు- 2024తో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఠాధీశ్వరులు, జగద్గురు శ్రీకాంతేంద్రస్వామీజీలు మాట్లాడుతూ.. సమాజ హితం కోసం సేవ చేసే వారిని గుర్తించి అవార్డులతో సత్కరించడం అభినందనీయమన్నారు. ఇలాంటి అవార్డులు వారిలో మరింత ప్రోత్సాహాన్ని నింపుతుందన్నారు. జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, చర్లపల్లి జైలు డిప్యూటీ సూపరెండెంట్ కాళిదాస్, తెలంగాణ సాహితీ అకాడమీ కార్యదర్శి బాలాచారి, ఐఎన్‌పీఆర్ పబ్లిసిటీ సెల్ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ డాక్టర్ నీలిమాకృష్ణమూర్తి, విశ్వనాథం, దిలీప్‌చారి, అంజన్న, తాటికొండ రంగబాబు, జితేంద్రచారి, గణేష్‌బాబు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాల కూల్చివేతకు రంగం సిద్ధం

- యజమానులకు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- 2023 వరకు 25 శిథిలావస్థ భవనాల గుర్తింపు



శిథిలావస్థ భవనాన్ని కూల్చివేసిన అధికారులు

అబిడ్స్: వర్షాకాలం ప్రారంభం కానుండడంతో శిథిల భవనాలను కూల్చివేసేందుకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వేగవంతంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రాణాంతకంగా మారిన శిథిలావస్థ భవనాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. గతంలో శిథిలావస్థ భవనాలతో కూలిపోయి పలు విషాదకర సంఘటనలు జరిగాయి. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టౌన్‌ప్లానింగ్ అధికారులు పురాతన భవనాలను నేలమట్టం చేసేందుకు నిమగ్నమయ్యారు. ఇటీవలనే గోషామహల్ నియోజకవర్గంలో ఒక పాత భవనం నేలమట్టం చేశారు. శిథిలావస్థకు చేరుకున్న పలు భవనాలను తొలగించాలంటే జీహెచ్ఎంసీ అధికారులకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కోర్టు వివాదాలే కారణం..

అబిడ్స్-14వ సర్కిల్ పరిధిలో శిథిలావస్థ భవనాలను కూల్చాలంటే జీహెచ్ఎంసీ అధికారులకు తలనొప్పిగా మారింది. పలు పాత భవనాలలో కిరాయిదారులు, ఓనర్లకు మధ్య ఎన్నో సంవత్సరాలుగా వివాదాలు చెలరేగుతున్నాయి. ఇరువురు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ఈ పాత భవనాల సమస్యలు సంవత్సరాల కొద్ది కేసులుగానే కొనసాగుతున్నాయి. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు ఇలాంటి వివాదంగా ఉన్న భవనాలను కూల్చివేయలేక పోతున్నారు. సర్కిల్-14వ పరిధిలోని గోషామహల్, బేగం బజార్, ఉస్మాన్‌గంజ్, షాయినాయత్ గంజ్, సిద్దిఅంబర్‌బజార్, చుడిబజార్, జాంబాగ్ ప్రాంతాల్లో పురాతనమైన పలు భవనాలు అలాగే ఉన్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు 2023 వరకు 25 శిథిలావస్థ భవనాలను గుర్తించారు. ఆయా భవనాలకు నోటీసులు కూడా జారీ చేశారు. మరో 6 భవనాలను ఇటీవల గుర్తించారు.

నోటీసులు జారీ చేస్తున్నాం..



శిథిలావస్థ భవనాలను కూల్చివేసేందుకు నోటీసులు జారీ చేస్తున్నాం. కొన్ని భవనాలలో న్యాయపరమైన సమస్యలు ఉన్నందునా కూల్చివేత ఆలస్యమవుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారుల నివేదికలు వచ్చిన వెంటనే శిథిలావస్థ భవనాల కూల్చివేతలు వేగవంతంగా చేపడుతాం. మా సిబ్బంది సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి శిథిలావస్థ భవనాలను కూల్చివేసేందుకు కృషి చేస్తున్నాం.

– సయ్యద్ సైదుద్దీన్, ఏసీపీ

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వేదపండితులు మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాల నడుమ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, శ్రీనాథ్‌గౌడ్, ఈఓ కె.రామాంజనేయుల సమక్షంలో రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవచనం, బిందెతీర్థం, బాల భోగము, బలిహరణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీసేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు.

'పాలస్తీనాకు మద్దతు తెలపాలి'



అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కోదండరాం, అజీజ్‌పాషా తదితరులు

కవాడిగూడ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని ప్రపంచ దేశాలు ముక్త కంఠంతో ఖండించి పాలస్తీనాలో శాంతి నెలకొల్పేలా కృషి చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దేశం చేస్తున్న దాడిని నిలిపేసి కాల్పులను విరమింపజేయాలని కోరుతూ.. ఆల్ ఇండియా తంజీమ్ ఈ ఇన్సాఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మున్నీరు పటేల్ అధ్యక్షతన పాలస్తీనాకు మద్దతుగా ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కోదండరాం, మాజీ రాజ్యసభ సభ్యులు అజీజ్‌పాషా, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ పాల్గొని మాట్లాడారు. జీ-20 దేశాల అధ్యక్షులుగా భారత్ వివరిస్తున్నందున పాలస్తీనాపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఉస్మాన్ అలీ హజారీ, హైకోర్టు అడ్వకేట్ అబ్జల్, నేతలు కై రొద్దీన్ సూఫీ, సీపీఐ నేతలు శ్రీమాన్ తదితరులున్నారు.

పోటీ పరీక్షలకు సంసిద్ధత అవసరం

చిక్కడపల్లి: ఎడ్యుకేషనల్ రీసెర్చ్, టీచింగ్ సంస్థ అయిన విజన్ ఐఏఎస్ ఆధ్వర్యంలో సివిల్స్ అభ్యర్థుల కోసం నిర్వహించిన యూపీఎస్ అభ్యాస్ ప్రిలిమ్స్‌కు (మాక్‌టెస్ట్) నుంచి విశేష స్పందన వచ్చిందని ఆ సంస్థ హైదరాబాద్ బ్రాంచ్ హెడ్ హరేకృష్ణసింగ్ అన్నారు. దేశ వ్యాప్తంగా 100 కేంద్రాల్లో 28,000 మందికి పైగా పాల్గొనడం విశేషం అని తెలిపారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఖచ్చితమైన సంసిద్ధత అవసరమని ఇది అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

మూఢనమ్మకాలపై ప్రదర్శన



ప్రదర్శనలో విజ్ఞాన దర్శిని కన్వీనర్ రమేష్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాయలు ,మహిమలు లాంటి మూఢనమ్మకాలు అభూత కల్పనలని విజ్ఞాన దర్శిని కన్వీనర్ రమేష్ అన్నారు. కొంతమంది వ్యక్తులు ప్రజలను మోసం చేసేందుకు వారి నుంచి డబ్బులు దండుకోవడానికి ఇలాంటివి చేస్తూ.. మభ్యపెడుతున్నారన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన దర్శిని, టీపీఎస్‌కే ఆధ్వర్యంలో మాయలు, మహిమల గుట్టురట్టు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మెజీషియన్స్ గాజు పెంకులపై డ్యాన్సులు వేయడం, వేడి నూనెలో కాలే బజ్జీలను చేయితో తీసే ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను ఆలోచింపజేశారు. నీళ్లల్లో కరిగిన పసుపు, కుంకుమను పొడిగా తీసి చల్లి ఆశ్చర్యానికి గురిచేశారు. అనంతరం విజ్ఞాన దర్శిని కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో కూడా అనేకమంది అమాయక ప్రజలను మంత్రాలు, మహిమల పేరుతో మోసం చేస్తూ.. తమ పబ్బం గడుపుతున్నారన్నారు. ఇలాంటి అభూత కల్పనలను నమ్మకుండా వాస్తవాలను ఆలోచించి సైన్స్‌పై దృష్టిపెట్టాలని కోరారు. సైన్స్‌తోనే సమాజ పురోగతి లభిస్తుందన్నారు. టీపీఎస్‌కే కన్వీనర్ భూపతివెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రభాలక్ష్మి, ఈశ్వరలింగం, తులసీరామ్, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థినులు

ముషీరాబాద్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి అన్నారు. ఆదివారం పాఠశాల ప్రాంగణంలోని రెయిన్‌బో హోమ్ అనాథాశ్రమంలో నెలరోజుల పాటు విద్యార్థినులకు అమాన్ వేదిక, నైటింగ్‌గేల్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో నృత్యం, నాటికలు, పాటలు, కంప్యూటర్‌లో శిక్షణ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, పెయింటింగ్, లైఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌తో పాటు కరాటేలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రెయిన్‌బో హోమ్ అనాథాశ్రమం నిర్వాహకులు బాలికలను చేరదీసి విద్యాబుద్ధులు అందించడంతో పాటు ఉచితంగా వసతి కల్పిస్తూ.. అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో శిక్షణ పొందిన విద్యార్థినులకు ప్రోత్సాహకర బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. సీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సంధ్య, బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, అమాన్‌వేదిక ప్రతినిధులు అనురాధ, అంబిక, రెయిన్‌బో హోమ్ మేనేజర్లు ఎల్లయ్య, సదాలక్ష్మి, లక్ష్మి, అనిత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ సుచరితరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సుచరితరెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సహకారంతో పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్, 9 స్టార్ హెల్త్‌కేర్, జీజీ చారిటీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో మెగా హెల్త్‌క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సుచరితరెడ్డి మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వద్ద ఉన్న 9 స్టార్ హెల్త్ కేర్ ఆస్పత్రిలో ఒక్క రూపాయిలో కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉచితంగా రక్తం, బీపీ, డెంటల్, ఆర్థోపెడ్, ఫిజియోథెరపీతో పాటు వివిధ వైద్య పరీక్షలను సుమారు 500 మందికి ఉచితంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్.వివేక్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిగౌడ్, గంగాధర్‌గుప్తా, ఎస్.రమేష్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రేష్టా, నవీన్, సురేష్, శివ, శంకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శబంకర్ దయానంద్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా శబంకర్ దయానంద్ నియమితులయ్యారు. ఆదివారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవన్ రాష్ట్ర కార్యాలయంలో శబంకర్ దయానంద్‌కు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్టీ చంద్రశేఖర్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలో ఆటోలు నడుపుకుంటూ.. జీవనం సాగిస్తున్న ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. యూనియన్ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తనను గ్రేటర్ అధ్యక్షుడిగా నియమించిన ఐఎన్‌టీయూసీ నేతలు, సహకరించిన యూనియన్ రాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ నేతలు ఎస్.నరసింహారెడ్డి, గోదా మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. ఆర్‌ఓఎం ఫీడర్ పరిధిలో ఎమ్మార్వో ఆఫీస్, 10 టీవీ, ఆర్టీసీ కల్యాణమండపం, అచ్చయ్యనగర్, తదితర ప్రాంతాల్లో 11 నుంచి 12 వరకు, ఆజామాబాద్ ఫీడర్ పరిధిలో రాంనగర్, శ్రీనివాస టెక్స్‌టైల్స్, గురుండా అపార్ట్‌మెంట్, శాస్త్రినగర్ ఫీడర్ పరిధిలో శాస్త్రినగర్, మోహన్‌నగర్, జెమినికాలనీ, సెయింట్ పాయిస్ స్కూల్ తదితర ప్రాంతాల్లో 12 నుంచి 2 వరకు, పార్శిగుట్ట ఫీడర్ పరిధిలో ప్రేయర్ పవర్ చర్చి, బాపిస్ట్ చర్చి, బ్రహ్మంగారి టెంపుల్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 4 వరకు, 44 నెంబర్ ఫీడర్ పరిధిలో గంగపుత్ర కాలనీ, ఫిష్ మార్కెట్, 44 నెంబర్ బస్టాప్, ఫ్రెండ్స్ కాలనీ, రామాలయం, అచ్చయ్యనగర్ నాలా తదితర ప్రాంతాల్లో 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి



గుజ్జ సత్యం

కాచిగూడ: పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసిన తర్వాత బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఓ ప్రకటన ద్వారా కోరారు. అసెంబ్లీలో చట్టం చేసి 42శాతం రిజర్వేషన్లు పెట్టాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు దీనికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని, లేదంతే ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో గ్రామస్థాయి నుంచి బీసీలు ఉద్యమిస్తారని హెచ్చరించారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు

నల్లకుంట: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బిట్స్ పిలానీ అయితే, కాంగ్రెస్ అభ్యర్థి 'పల్లీ బఠాణీ' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను అంబర్‌పేట నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖండించారు. కేటీఆర్ దృష్టిలో బిట్స్ పిలానీలో చదివిన వాళ్లే పట్టభద్రులు ఓయూ, కేయూలో చదివిన వారు పట్టభద్రులు కారా అని ప్రశ్నించారు. ఆదివారం నల్లకుంటలోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీసెల్ మాజీ చైర్మన్ జీబీ. శ్యామ్‌రావు, పీసీసీ కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడారు. ఓయూ, కేయూల్లో చదువుకున్న పట్టభద్రులను అవమానపరిచేలా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సుమోటగా తీసుకుని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ అభ్యర్థి కోసం కేవలం బిట్స్ పిలానీలో చదివిన వాళ్లనే ఓట్లు అడగాలని, ఓయూ, కేయూలో చదివిన పట్టభద్రులను ఓట్లు అడగొద్దని హితవు పలికారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్ రెడ్డి, కె. గోవర్ధన్‌రెడ్డి, కాంతారావు, సీహెచ్. మురళీకృష్ణ, శరత్, ఎన్.గిరి, ఎడ్ల నరేందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, విజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావి నారాయణరెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కళా జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: నిజాం నిరంకుశ పాలన భూస్వామ్య వ్యవస్థ అంతమొందించేంత వరకు రావి నారాయణరెడ్డి అలుపెరగని పోరాటం చేశారని త్యాగరాయగానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనమూర్తి అన్నారు. ఆదివారం త్యాగరాయగానసభ నిర్వహణలో కళాలలితా కళావేదికలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు రావి నారాయణరెడ్డి యాదిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడని చెప్పారు. హైదరాబాద్ స్టేట్‌లో రజాకార్ల ఆకృత్యాలను ఆరికట్టడానికి అజ్ఞాతంగా ఉంటూ.. గెరిల్లా దళాలను ఏర్పాటు చేసి సాయుధపోరాటం చేశారని ప్రముఖ గాయని ఆమని అన్నారు. 500 ఎకరాల సొంతభూమిని పేదలకు పంచిన మహనీయుడని కొనియాడారు. ప్రముఖులు సత్యనారాయణమూర్తి, తోట శ్రీలక్ష్మి, చక్రపాణి పాల్గొన్నారు.

డబ్బుల కోసం దాడి: నిందితుడి అరెస్టు

బంజారాహిల్స్: జల్సాలకు అలవాటుపడ్డ ఓ యువకుడు మద్యం కోసం దారికాచి ఓ వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేయడమే కాకుండా దాడి చేసిన ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-5లోని దేవరకొండ బస్తీలో నివసించే నవీన్ ఆటోడ్రైవర్. శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా అదే బస్తీకి చెందిన సాగర్‌బాబు అలియాస్ పప్పు అనే ఆవారా యువకుడు అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశాడు. తన వద్ద డబ్బులు లేవని నవీన్ చెప్పినా వినిపించుకోకుండా కోపంతో తన చేతికి ఉన్న ఇనుప కడియంతో తలపై బాదాడు. దీంతో నవీన్ తల పగిలి తీవ్ర గాయాలపాలుకాగా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన రౌడీ సాగర్‌బాబు అలియాస్ పప్పును బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై గతంలోనే పంజగుట్ట, లంగర్‌హౌస్, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లలో నాలుగు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన 10 గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసిన సిబ్బందిని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి అభినందించారు.

అనారోగ్యం తాళలేక వివాహిత ఆత్మహత్య

బంజారాహిల్స్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బందారిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల పద్మ(33) భర్త కృష్ణతో కలిసి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని శ్రీరామ్‌నగర్ బస్తీలో అద్దెకు ఉంటుంది. వీరికి ముగ్గురు పిల్లలు. కొంతకాలంగా పద్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా ఇబ్బందులకు గురవుతుంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త కృష్ణ జీహెచ్ఎంసీలో డ్రైవర్‌గా పనిచేస్తుండగా సోదరిని కలవడానికి వచ్చిన పద్మ సోదరుడు రాము ఆమె ఎంతకీ తలుపు తీయకపోయేసరికి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే తలుపులు పగులగొట్టి మహావీర్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.